# మనసున మనసై

ద్విభాష్యం శ్రీలక్ష్మీ వందన

'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు నీకోసమే కన్నీరు నించుటకు నేనున్నానని నిండుగ పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ... అదే స్వర్గము' హృది లోతుల్ని సైతం తట్టి పిలుస్తూ సాగిపోతున్న గీతం, నక్షత్ర మాలలను ధరించి మెరిసిపోతున్న గగనం, మేఘపు మేలిముసుగు మాటుగా పలకరిస్తున్న నిండైన చంద్రబింబం. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని నిదురలేచే మబ్బుకన్నె అందం, ఆ మబ్బు తన కలను మెత్తగా స్పృశిస్తున్న చిరుగాలి చందం, ఆ వెంట పుడమి యదపైకి జాలువారే నీటి తుంపరల సోయగం, ఆ జల్లులో పులకరించి ఆడే గులాబీల లాలిత్యం. వీటన్నిటి మధ్యా ఉంటే కాలమే తెలిసేదికాదు ఒకప్పుడు నాకు. అంతేకాదు, ఈ ప్రకృతి మాత ఒడిలో పొందే లాలలను మించిన ఆనందం మరొకటి ఉండదనిపించేది. కానీ ఈ క్షణంలో నా చుట్టూ ఉన్న అదే ఇష్టమైన వాతావరణం నా చికాకును రెట్టింపు చేయడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. ''ప్రేమ చాలా శక్తివంతమైనది. అదృశ్యశక్తిలా మనసును కమ్ముకొని గుప్పెడు గుండెలో అనంతమైన సంచలనాన్ని కలిగించి, చివరికి హృదయాన్ని ఛిద్రం చేసి నీకు నువ్వు ఏమవుతావో తెలియని స్థితి కల్పిస్తుంది. అందుకే ప్రేమ ప్రాణాంతకం కూడా'' ఒకప్పుడు నా స్నేహితుడన్న మాటలు గుర్తొచ్చి భావరహితమైన చిరునవ్వు నా పెదవులపై కదలాడింది. ఆ రోజులలో అతని మాటలు నాకు నవ్వు పుట్టించేవి. ప్రేమ రాహిత్యంతో బాధపడే అతని చేష్టలు నాకు చిత్రంగా తోచేవి. ప్రేమ వెనుక నీడలా ఏదో రూపంలో స్వార్థం ఉంటుందనేది అప్పటి నా వాదన. కానీ అతని మాటలలో అంతరార్థం ఏమిటో నాకు ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది. అందుకు కారణం 'ఆమె'. హృదయాంతరాలను సుతిమెత్తగా తాకే చూపులు, సవ్వడి లేకుండానే సప్తస్వరాలు పలికించగల చిరునగవు, లాలిత్య భరితమైన కుసుమాలను పోతపోసినట్లనిపించే ముగ్ధత్వం, వెరసి ఒక అపరంజి బొమ్మ 'ఆమె'. ప్రభాతవేళ అరుణకాంతులు చూసేందుకు మేడమీదకు చేరే నాకు దాదాపు ప్రతి ఉదయం ఎదురింటి ముందు రంగవల్లులు దిద్దుతూ దర్శనమిచ్చేదామె. కొన్నాళ్ళలోనే ప్రభాత కిరణాల అందాలు కాక, ఆ వెలుగుల మధ్య మరింత అందంగా కనిపించే ఆమెను చూసేందుకు మేడపైకి చేరడం అలవాటయిపోయింది నాకు. బెదురుచూపులతో, సన్నని చిరునగవుతో ఒక్క క్షణం నన్ను మౌనంగా పలకరించి అదృశ్యమయ్యేది ఆమె. రేపటి ఆ కొద్ది క్షణాల కోసం మరో ఇరవై నాలుగు గంటలు ఆశగా ఎదురుచూసేవాడిని నేను. ఆమె నా జీవితాంతం తోడుగా ఉంటే బాగుండునన్న కోరిక నాకు తెలియకుండానే నాలో చోటుచేసుకుంది. నా నిర్ణయం ఆమెకు తెలిపే ఉద్దేశ్యంతో ఉదయాన్నే నిదురలేచి బయటకు నడిచాను. ఎప్పటిలాగే ఎదురింటి ముందు రంగవల్లులు దిద్దుతోందామె.

మెల్లగా గేట్ తీసి అటువైపు కదిలాను. ఆమెను సమీపించి కాస్త ధైర్యం కూడగట్టుకొని ''ఏమండీ! మీ పేరు...'' నా ధైర్యం అక్కడితో అయిపోయినట్లుంది. మరిక మాట్లాడలేక అలాగే నిలబడిపోయాను. అంతవరకూ నన్ను గమనించని ఆమె నా మాటలకు ఒక్కసారిగా తలెత్తి చూసింది. ఆ క్షణంలో ఆమె కళ్ళలో కనిపించిన అందమైన మెరుపు నా చూపులను దాటిపోలేదు. ఆ కళ్ళలో నారాక నిజమేనా అన్న సంశయం. నిజమని తెలిసిన మరుక్షణం ఆమె అధరాలపై చిరునగవు తొణికిసలాడబోయి అంతలోనే మాయమైంది. నేను ఏదో అడిగేలోపు అక్కడి నుంచి వేగంగా ఇంటిలోకి వెళ్ళిపోయిందామె. నేను అసహనంగా లోనికి నడిచాను. సుమారు ప్రతిరోజూ ఏదో పలకరించి బదులురాక భంగపడ్డాను. చివరిసారిగా ఆమె తప్పించుకోలేని స్థితి కల్పించి, నా మనసులో మాట ఆమెకు చెప్పాను. ఆమె నుంచి మౌనంతోనే సమాధానం అందుకొని వెనుతిరిగాను. నాలో అర్థంకాని అంతర్మథనం. అన్నీ ఇచ్చిన ఆ భగవంతుడు ఆమెను మూగదానిగా పుట్టించాడన్న నిజం నేను జీర్ణించుకోడానికి చాలా సమయం పట్టింది. నాకు మళ్ళీ ప్రభాత కిరణాలనుగానీ, ఆ వెలుగుల మధ్య కనిపించే ఆమెను కానీ, చూడాలనిపించలేదు. నిజంగా ఆమెపై నాకున్నది ప్రేమా, ఆకర్షణా అన్నది ఆమెను చూడని ఆ వారం రోజులలో నాకు అంతుచిక్కని విషయం. కానీ నాలో అంతర్గతంగా ఉన్న శక్తి ఏదో నన్ను బలహీనుణ్ణి చేసింది. ఆమె మాత్రమే నా జీవితంలో తోడుగా ఉండాలని శాశించగలిగింది. మళ్ళీ ఆమెను చూడాలన్న కోరికతో మేడపైకి చేరాను. కానీ ఆమె కనిపించలేదు. ఆనాటి నుంచీ, ఈనాటి వరకు, నా తిరస్కారం ఆమెని ఎంతగా బాధించిందో ఆమె ఊరు విడిచి వెళ్ళిపోయిందన్న నిజం తెలిసే వరకూ నాకు అర్థం కాలేదు. ఆమె ప్రభావం నాపై ఎంతగా ఉందో ఆమెకు దూరమైన ఈ మూడునెలలలో నాకు బాగా అర్థం అయింది. ఆమె జాడ తెలుసుకోవాలని నేను ఎంతగా ప్రయత్నించినా అది వృధా ప్రయాసే అయింది. నేను చేసిన చివరి ప్రయత్నం పేపర్‌లో ప్రకటించడం. ఇదయినా ఫలిస్తుందని నాలో ఎక్కడో చిన్న ఆశ. ఆలోచనల మధ్య ఆకాశంలో మెరిసే నక్షత్రాలను చూస్తూ వెనక్కి వాలాను.

★ ★ ★

నా నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ వినిపిస్తున్న కాలింగ్ బెల్ శబ్దానికి చికాగ్గాలేచి వెళ్ళి తలుపుతీసాను. నమ్మలేని నిజంగా ఎదురుగా 'ఆమె'. నేను అనుభవించిన మానశిక సంక్షోభానికి రెట్టింపు బాధ ఆమె అనుభవించిందని ఆమె రూపమే చెపుతోంది. నన్ను చూసిన మరుక్షణం ఆమె కన్నులు అశృధారలు వర్షించాయి. ఆమెను అలా చూడగానే నాకళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు చేరాయి. అపురూపంగా ఆమెను హృదయానికి హత్తుకున్నాను. నా కన్నీళ్ళు ఆమె శిరస్సును అభిషేకిస్తున్నాయి. ఆమె కంటి నుండి జాలువారిన ఒక అశృబిందువు నా హృదయాన్ని చేరి ఇంకిపోయింది.

'నీ వ్యధ తెలిసి, నీడగ నిలిచే తోడకరుండిన అదే భాగ్యమూ... అదే స్వర్గము' సుమధురమైన ఆగానం వినిపిస్తూనే ఉంది.

★